క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



శ్రీశైలం టెంపుల్: లోక కల్యాణార్థం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామి వారికి విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీ సేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను జరిపించారు. తరువాత స్వామివారికి పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించారు.

అనుమానితులకు రూములివ్వొద్దు



సత్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాద రావు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో అనుమానిత వ్యక్తులకు రూములు ఇవ్వరాదని శ్రీశైలం సీఐ జి. ప్రసాదరావు సూచించారు. గురువారం శ్రీశైలం పోలీస్ స్టేషన్‌లో సత్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. శ్రీశైలం మహా పుణ్యక్షేత్రానికి వీవీఐపీ సందర్శన దృష్ట్యా భద్రతా చర్యల్లో భాగంగా సత్రాల మేనేజర్లకు పలు సూచనలు చేశారు. రూము కచ్చితంగా 24 గంటల్లో రెన్యువల్ చేయించాలని, ఒక రోజు కన్నా ఎక్కువ ఎవరికీ గది ఇవ్వరాదదు ఆదేశించారు. రూమ్ బాయ్స్, పనిచేసే వారిని కొత్తగా ఎవరినీ పనిలో నియమించకూడదని, సత్రాలలో పనిచేసే వారి నడవడిక, ప్రవర్తనను గమనిస్తుండాలని చెప్పారు. అన్ని సత్రాలలో సీసీ కెమెరాలు తప్పనిసరన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారుడి ఏక పాత్రాభినయం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళావేదికపై నెల్లూరుకు చెందిన అమ్మిరెడ్డి రఘునాథరెడ్డి, బృందం వారు మహాభారత ఘట్టాలు, ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. కార్యక్రమాలు భక్తులను అలరించాయి.


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన కబడ్డీ క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నందికొట్కూరు: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గవర్నమెంట్ జూనియర్ కళాశాల క్రీడాకారులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రఘురామాచార్య అన్నారు. గురువారం పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాల క్రీడాకారులు ఈ నెల 8న కర్నూలు జిల్లా చిన్నటేకూర్ గురుకులంలో జరిగిన స్కూల్ గేమ్ అండర్–19 పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులు వై. సుధీర్, జీ. హెప్సిబా, స్టాండ్ బైగా ఎంపికైన శివప్రసాద్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రియాజుద్దీన్, చంద్రహాసుడు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

బానకచెర్ల నుంచి 5వేల క్యూసెక్కుల నీటి విడుదల



బానకచెర్ల రెగ్యులేటరు నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి కేవలం 5వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి 5వేల క్యూసెక్కుల నీరు ఎస్ఆర్ఎంసీ ద్వారా ఇన్‌ఫ్లో ఉందన్నారు. కాగా తెలుగుగంగ (వీబీఆర్)కు 4,500 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్‌కు 300 క్యూసెక్కులు, ఎస్కేప్ ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. దిగువనున్న గోరుకల్లు, గుండ్రేవుల, మైలవరం, సోమశిల ప్రాజెక్టులు అన్ని నిండినందున 10 రోజుల నుంచి నీటి విడుదలను తగ్గించినట్లు వివరించారు.

రాయితీ 'అరకొర'

- జూపాడుబంగ్లా మండలానికి అరకొరగా మంజూరైన శనగ విత్తనాలు
- ప్రతిపాదనలు పంపింది కొండంత.. మంజూరైంది గోరంత
- బహిరంగ మార్కెట్ రేటుతో సమానంగా రాయితీ విత్తనాల ధర



జూపాడుబంగ్లా వ్యవసాయ శాఖ కార్యాలయం

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌కు గాను అరకొరగా శనగ విత్తనాలు మంజూరు చేయటంతో మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదనలు పంపించింది కొండంతైతే మంజూరైంది గోరంత అని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధర కూడా మంజూరైన శనగలు ఏమూలకూ సరిపోవని, ప్రజాప్రతినిధులు, జిల్లా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకొని మండలంలోని రైతులకు సరిపడా శనగ విత్తనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

2,600 క్వింటాళ్లకు గానూ.. 200 క్వింటాళ్లు మంజూరు

మండలంలోని పారుమంచాల, తర్తూరు, మండ్లెం, తూడిచెర్ల, పి.లింగాపురం, తరిగోపుల, తాటిపాడు, 80బన్నూరు తదితర గ్రామాల్లో రబీ సీజన్‌కు గాను శనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,642హెక్టార్లు. అందుకుగాను రైతులకు 2,600క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు చేయాలని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే జిల్లా వ్యవసాయ అధికారులు మండలానికి కేవలం 200 క్వింటాళ్ల జేజే 11 రకం శనగ విత్తనాలు మంజూరు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. వచ్చిన స్టాకును రైతులకు సరిపుచ్చటానికి గాను 0.50సెంట్ల పొలం ఉన్న రైతులకు కేవలం 20కిలోల (ఓ బ్యాగు) శనగలు, ఎకరా పొలం ఉన్న రైతుకు 40 కిలోలు(రెండుబస్తాలు), ఎకరా పైబడి పొలం ఉన్న రైతులకు 60కిలోలు (మూడుబస్తాలు) చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించారు.

బహిరంగ మార్కెట్ రేటుతో రూ.150 మాత్రమే తేడా..

క్వింటాలు శనగల పూర్తి ధర రూ.7,800లు కాగా 25శాతం రాయితీ రూ.1,950 పోను రైతులు రూ.5,850లు చెల్లించాల్సి ఉంది. అయితే బహిరంగ మార్కెట్లో శనగ విత్తనాలు క్వింటా రూ.6వేలకు లభిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అంటే బహిరంగ మార్కెట్‌కంటే కేవలం రూ.150లు తక్కువకు అందజేయడం విడ్డూరంగా ఉందంటున్నారు. రైతులకు రాయితీపై విత్తనాలు ఇస్తున్నామని పేర్కొంటూ కేవలం రూ.150ల రాయితీ ఇవ్వడం తగదంటున్నారు. ఇదిలా ఉండగా రాయితీ శనగ విత్తనాలను తీసుకొనేందుకు రైతులు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల వద్దకు వెళ్లగా సైట్ ఓపెన్‌కావటం లేదని రైతుసేవా కేంద్రాల సిబ్బంది పేర్కొంటున్నారని రైతులు తెలిపారు.

సరిపడ విత్తనాలు మంజూరు చేయాలి



రబీ సీజన్‌కు గాను మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు అధికంగా శనగపంటను సాగు చేస్తారు. వారికి సరిపడా శనగ విత్తనాలను జిల్లా ప్రభుత్వం మంజూరు చేయాలి. రాయితీపై ఇస్తున్న శనగ విత్తనాల ధర బహిరంగ మార్కెట్ ధరతో సమానంగా ఉండటం తగదు. రైతులకు రాయితీపై ఇస్తున్న శనగ విత్తనాల ధరను తగ్గించి మండలానికి కనీసం 2వేల క్వింటాళ్ల శనగలు మంజూరు చేయాలి.

– కర్ణ, వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు

ప్రతిపాదనలు పంపించాం



మండలానికి 2,600 క్వింటాళ్ల శనగలు మంజూరు చేయాలని జిల్లా అధికారులకు మొదట ప్రతిపాదనలు పంపించాం. మండలానికి కేవలం 200క్వింటాళ్లు మంజూరు చేశారు. మంజూరైన శనగ విత్తనాలు సరిపోనందున కనీసం 2వేల క్వింటాల్లైనా మంజూరు చేయాలని మళ్లీ ప్రతిపాదనలు పంపించాం. – కృష్ణారెడ్డి, ఏఓ, జూపాడుబంగ్లా

సమీక్షా సమావేశానికి తరలిరండి

ఆత్మకూరు: నంద్యాలలోని పొగాకు కంపెనీ సమీపంలోనున్న ఆర్.కె.ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే జిల్లా సమీక్ష సమావేశానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, అధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

విద్యార్థులూ.. ఒత్తిడికి లోనవ్వొద్దు

బండి ఆత్మకూరు : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కేజీబీవీలో కెరియర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు సునీత, ఈశ్వర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థి మేలుకో – నీ మానసిక ఆరోగ్యం కాపాడుకో.. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు మానసిక ఒత్తిడికి లోనవరాదని సూచించారు. మానసిక ఆరోగ్యం ప్రాధాన్యత, ఒత్తిడి నివారణ, యోగా, ప్రశాంతత సాధనపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌ఓ ద్రాక్షాయిని, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలు తగవు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య

పగిడ్యాల: ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది వ్యక్తిగత దూషణలు చేయడానికి కాదని, ప్రజా సమస్యలను పరిష్కరించడానికేనన్న సంగతిని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి గుర్తుంచుకోవాలని జెడ్పీటీసీ పుల్యాల దివ్య తీవ్ర స్థాయిలో విమర్శించారు. గురువారం జెడ్పీటీసీ తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గౌరవ ఎంపీ గారూ.. బుధవారం లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించడానికి వెళ్లి కాంట్రాక్టర్‌పై నోరు పారేసుకుని వ్యక్తిగత దూషణలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారం ఎల్లకాలం శాశ్వతం కాదన్న సంగతిని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఫిల్టర్ బెడ్లలోని ఇసుక మార్చడం కాంట్రాక్టర్ బాధ్యత కాదని, ప్రాజెక్ట్ అధికారుల బాధ్యత అన్న సంగతిని విస్మరించి కాంట్రాక్టర్‌ను దూషించి మాట్లాడం ఎంపీ స్థాయికి తగదన్నారు. నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నాగటూరు ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారిందని ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించి దానిని ఉపయోగంలోకి తీసుకొస్తే జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల్లోని 10 వేల ఎకరాల రైతులకు మేలు చేసిన వారవుతారని తెలిపారు. ఇప్పటికైన వ్యక్తిగత దూషణలపై కాకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై ఎంపీ దృష్టి పెట్టాలని హితవు పలికారు.

పరామర్శ



మృతుడు శంకర్‌రెడ్డి భార్య ప్రమీలమ్మ, కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డిలను పరామర్శిస్తున్న డాక్టర్ దార సుధీర్

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మండల ఉపాధ్యక్షుడు వంగాల శంకర్‌రెడ్డి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ గురువారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం శంకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకొని ఆయన భార్య ప్రమీలమ్మ, కుమారుడు లాయర్ చంద్రశేఖర్‌రెడ్డిలను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. శంకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్ఈసీ మెంబర్, జెడ్పీటీసీ పోచా జగదీశ్వర రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు కోసిక తిరుమలేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తువ్వా మల్లారెడ్డి, మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి, బొమ్మనమద్దిలేటిరెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి, చిన్నమల్లయ్య, అవిజ తిరుమలేష్ అన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

జూపాడుబంగ్లా: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారు ఎంతటివారైనా, ఎలాంటి వారైనా ఉపేక్షించేదిలేదని ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. గురువారం పారుమంచాల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గాంధీసెంటర్‌లో ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఏదేని సమస్య వస్తే ఆవేశానికిలోనై ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. ఘర్షణలు, తగాదాలకు పాల్పడటం వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు. సత్వరమే పోలీసులను ఆశ్రయించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

వర్షం.. అన్నదాతలో భయం



కొత్తపల్లి వద్ద మొక్కజొన్న ధాన్యంపై పట్టలు కప్పుకుంటున్న రైతన్నలు

కొత్తపల్లి: మండలంలోని నందికుంట, దుద్యాల, బావాపురం, ఎం.లింగాపురం, గోకవరం, శివపురం, ఎదురుపాడు, కొక్కెరంచ గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న రైతన్నలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పుడిప్పుడే మొక్కజొన్న పంటల కాలం పూర్తి అవ్వడంతో రైతన్నలు కోతలు మొదలు పెట్టారు. కోసుకున్న మొక్కజొన్న ధాన్యాన్ని ఖాళీ ప్రదేశాల్లో అన్నదాతలు ఆరబోసుకున్నారు. వర్షం రావడంతో ఎక్కడ వర్షం పాలవుతాయోనని ఆందోళన చెంది టార్పలిన్ పట్టలను కప్పుకొని ధాన్యాన్ని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

సంక్షిప్తం

బహిరంగ వేలం వాయిదా

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానంలో సిద్ధరామప్ప షాపింగ్ కాంప్లెక్స్, లలితాంబిక షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగానున్న షాపులకు శుక్రవారం నిర్వహించవలసిన బహిరంగ వేలం వాయిదా వేసినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ విచ్చేయుచున్న సందర్భంలో సిబ్బంది ప్రత్యేక విధుల్లో ఉన్నందున బహిరంగ వేలాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి వేలం నిర్వహించే తేదీని తెలియజేస్తామని చెప్పారు.

భారీ వర్షం



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు: పట్టణంతో పాటు, మండలంలోని గ్రామాల్లో వరుణుడు మరోసారి ఉరిమాడు. గురువారం ఉరుములు, మెరుపులు, పెను గాలులలతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ప్రధానంగా నల్లకాల్వ, కరివేన, బాపునంతపురం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పొలాల్లో వర్షపు నీరు ప్రవహించింది. ఇప్పటికే వందలాది ఎకరాల్లో మొక్కజొన్న, సోయాబీన్ పంటలు నష్టపోయి రైతులు తల్లడిల్లితున్న తరుణంలో వర్షం కురవడంతో మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా తయారైంది వారి పరిస్థితి. ఏదో అరకొరగా మిగిలిన పంటలు కూడా ఈ వర్షానికి దెబ్బతింటాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

సమయానికి బస్సు సర్వీసులు నడపాలి

నందికొట్కూరు: పాఠశాలలు, కళాశాలల సమయానికి విద్యార్థులు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మద్రిస్వామి కోరారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో అధికారులకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల వేళలకు బస్సులను నడపాలన్నారు. సమయానికి పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లలేక యాజమాన్యం క్రమశిక్షణ చర్యలకు గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జబీవుల్లా, శివ, ఖలీల్, అరవింద్, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కష్టం గొర్రెల పాలు



నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల గ్రామంలో రైతుల కష్టం గొర్రెల పాలయ్యింది. గ్రామానికి చెందిన తత్తూరు రంగన్న మూడు ఎకరాలు, శివన్న రెండు ఎకరాలు, ఎల్లప్ప రెండు ఎకరాల చొప్పున్న ఉల్లి పంట సాగు చేశారు. ఎకరాకు రూ. 2 లక్షల చొప్పున పెట్టుబడి పెట్టారు. అయితే సరైన ధర లేకపోవడంతో కోత కోసే కూలీలు, మార్కెట్‌కు తరలించే లారీల బాడుగలకు కూడా డబ్బులు రావని గొర్రెలకు వదిలేశారు. ప్రభుత్వం వెంటనే ఉల్లి రైతులను నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కాలేజీల ప్రైవేటీకరణ విరమించే వరకు పోరాటం

- దోచుకోవడానికే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ
- వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ, ర్యాలీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకునే వరకూ పోరాడుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో వైద్య విద్యనభ్యసించి విద్యార్థులు మేధావులుగా తయారవుతారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేరుగాంచిన వైద్యులు నాగేశ్వరరెడ్డి కర్నూలు మెడికల్ కళాశాలలోనే చదువుకున్నారని గుర్తు చేశారు. ప్రైవేట్ మెడికల్ కళాశాలలో డబ్బులున్న పిల్లలు మాత్రమే వైద్య విద్య చదువుకోగలుగుతారని, పేద విద్యార్థులకు ప్రైవేటీకరణ వల్ల వైద్య విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద విద్యార్థులను కూడా డాక్టర్లను చేయాలనే తలంపుతో 17 మెడికల్ కళాశాలలు తెచ్చి అందులో 5 పూర్తి చేశారని దార సుధీర్ గుర్తు చేశారు. పులివెందుల మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయిన తర్వాత ఎన్ఎంసీ వంద వైద్య సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పులివెందులలో నిర్మాణం పూర్తి కాలేదని, మెడికల్ వైద్య సీట్లు వద్దని లెటర్ రాయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రైవేటీకరణతో ప్రజారోగ్యం కుంటుపడుతుందని చెప్పారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు సంతకాల సేకరణ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గంలో 50 వేల సంతకాల సేకరణ చేపడతామన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 28న ర్యాలీ

ప్రైవేటీకరణ వద్దు ... గవర్నమెంట్ ముద్దు అనే నినాదంతో ఈ నెల 28వ తేదీన పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి సంబంధించిన అధికారులకు వినతి పత్రం అందజేస్తామని దార సుధీర్ తెలిపారు. రచ్చబండ కార్యక్రమాలు చేపట్టి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చేరవేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉపేంద్రారెడ్డి, రమణ, సురేష్‌కుమార్, మాధురి, శివరామకృష్ణారెడ్డి, నాగార్జునరెడ్డి, అబుబక్కర్, రాజు, నాగశేనారెడ్డి, చరణ్, లడ్డు, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

పాములపాడు: విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కెరీర్, మెంటల్‌హెల్త్ కౌన్సిలర్ నాగన్న అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్లో మానసిక ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాసరచన పోటీ, పోస్టర్‌మేకింగ్, మైండ్ రిలాక్సేషన్ యాక్టివిటీలు చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సువర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ అన్నమ్మ పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

ఆత్మకూరు: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం పట్టణంలోని దుకాణాల వద్ద జీఎస్టీపై వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి ప్రజలకు తగ్గిన ధరలు, ప్రయోజనాలను వివరించారు. అంతకముందు కళాశాలలో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ కళ్లను పరిశుభ్రమైన చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు అనిల్‌కుమార్, చక్రధర్, తిరుపతమ్మ, అచ్యుత్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తి వేయాలి

ఆత్మకూరు: నంద్యాలలో పాత్రికేయులపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆత్మకూరు డివిజన్ జర్నలిస్టు యూనియన్ల నాయకులు కోరుతూ గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విలేకరులు అన్వర్, పటాన్, వలిఖాన్, శశి మాట్లాడుతూ పోలీసులు వివిధ ఛానళ్లపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: జర్నలిస్ట్‌లపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ గురువారం శ్రీశైలం మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు నిరసన వ్యక్తం చేశారు. సున్నిపెంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ.. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఎ.రాజేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

తుస్సుమన్న పల్లెపండుగ



పాలెంచెరువు గూడెంలో సర్పంచు మశమ్మతో టెంకాయ కొట్టిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పల్లెపండుగ పేరుతో కార్యక్రమాలు నిర్వహించి అధికారులు, కూటమి నాయకులు గోకులం షెడ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించాల్సి ఉంది. అయితే గురువారం మండలంలో చేపట్టిన పల్లెపండుగ తుస్సుమంది. మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారుల సమన్వయంతో గురువారం నుంచి 14వ తేదీ వరకు పల్లెపండుగ కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించాలని ఎంపీడీఓ మేరి నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగా గురువారం గువ్వలకుంట్ల, జి.వీరాపురం, గోకవరం గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. అయితే కేవలం గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీలోని మజరా గ్రామమైన పాలెంచెరువు గూడెంలో మాత్రమే కార్యక్రమం నిర్వహించి, మిగతా గ్రామాల్లో చేపట్టలేదు. అక్కడ కూడా ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, టెక్నికల్ అసిస్టెంట్ బషీరూన్‌లు సర్పంచు మశమ్మతో గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ కోసం టెంకాయ కొట్టించి తూతూ మంత్రగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఈ విషయంపై ఏపీఓ విమలమ్మను వివరణ కోరగా తాను స్థానిక కూటమి నాయకులకు సమాచారమిచ్చానని, వివిధ కారణాలతో కార్యక్రమాలను వాయిదా వేశారని చెప్పడం గమనార్హం.



బొల్లవరం సమీపంలో ఇలా..

మంటలు కావవి.. మేఘాలే



అరుణ వర్ణంలో ఆకాశం..



ఇళ్లల్లో నుంచి మంటలు వస్తున్నట్లుగా..

మహానంది: ఇదేంటి ఇళ్లల్లోంచి మంటలు వస్తున్నాయన్నట్లుగా ఉన్న ఈ దృశ్యాలు గురువారం సాయంత్రం ఆవిష్కృతమైంది. నింగి అరుణ వర్ణంలో విరాజిల్లడంతో చూపరులను ఆకట్టుకుంది. ఎరుపెక్కిన మేఘాలు దారిని పరిచాయి. పచ్చటి పంట పొలాలపై మండుతున్న మంటల్లాగా ఆకాశం అబ్బురపరిచింది. మండలంలోని బొల్లవరం, బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాల వద్ద ఆకాశం వర్ణరంజితమైన దృశ్యాలను సాక్షి కెమెరాలో బంధించింది.

పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన

బండి ఆత్మకూరు: ఎనిమిదవ జాతీయ పోషణ మాసం సందర్భంగా మండలంలోని నెమల్లకుంట గిరిజన గూడెంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.రమాదేవి ఆధ్వర్యంలో చెంచు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ కోటేశ్వరి మాట్లాడుతూ మునగాకు తదితర ఆకుకూరలు, సీజనల్ కూరగాయలు, పండ్లలోని పోషక విలువలను వివరించారు. అనంతరం బయమ్మ అనే గర్భిణికి సీమంతం నిర్వహించారు. అలాగే బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. చెంచు మహిళలకు పండ్లు, గుగ్గిళ్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయలక్ష్మి, కోమల, కవిత, జీసీ పాలెం పంచాయతీ సెక్రటరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు రోజులు ఏపీజీబీ సేవలు బంద్

నందికొట్కూరు: మూడు రోజుల పాటు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సేవలు నిలిపివేస్తునట్లు బ్యాంక్ మేనేజర్ రియాజ్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలోని ఏపీజీబీలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న ఉదయం 10 గంటల వరకు ఆర్థికపరమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండవన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏఈపీఎస్ తదితర సేవలు అందుబాటులో ఉండవని తెలియజేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఖాతాదారులు ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు.